సాక్షి
విశాఖపట్నం
శనివారం । 17 । మే । 2025


మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ IIలో



ఫిర్యాదులు రాకుండా పనిచేయండి IIలో


ఎస్కార్ట్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలి IIలో

ఇంజినీరింగ్ మాయాజాలం

వీఎంఆర్‌డీఏలో బరితెగిస్తున్న అధికారులు

- తమ వారికే టెండర్లు దక్కేలా ప్రణాళికలు
- టెండర్లలో పాల్గొనొద్దంటూ కాంట్రాక్టర్లకు బెదిరింపులు
- 'ది డెక్' నిర్వహణకు సింగిల్ టెండర్.. అయినా అప్పగించేందుకు ప్లాన్
- ఇప్పటికే జనసేన మహిళా నేతకు కీలక కాంట్రాక్టులు అప్పగింత
- సీ హారియర్ నిర్వహణలో తక్కువకు టెండర్ వేసిన వారిని తప్పుకోవాలంటూ ఫోన్లు

విశాఖ సిటీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ఇంజినీరింగ్ అధికారుల వ్యవహారశైలి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. తమ వారికి కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు ఫోన్లు చేసి మరీ కాంట్రాక్టర్ల ను బెదిరించారన్న వార్తలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. టెండర్‌లో పాల్గొనవద్దని ఒకరికి, టెండర్ దక్కించుకున్నా కూడా వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా మరొకరికి ఇబ్బందులు కలిగిస్తున్నారనే చర్చ జరుగుతోంది. అలాగే మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ అండ్ కమర్షియల్ భవన నిర్వహణకు సంబంధించి సింగిల్ టెండర్ వచ్చేలా ప్రయత్నాలు చేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సదరు టెండర్‌దారునికే పనులు అప్పగించేందుకు ప్రణాళిక చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

ఫోన్లు చేసి బెదిరింపులు

వీఎంఆర్‌డీఏ ఇటీవల సీ హారియర్, ది డెక్ (మల్టీ లెవెల్ కార్ పార్కింగ్) వార్షిక నిర్వహణకు టెండర్లు పిలిచింది. ఈ టెండర్లలో ఒక ఇంజినీరింగ్ అధికారి రింగ్ మాస్టర్‌గా మారినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ టెండర్లను దక్కించుకోవడానికి కాంట్రాక్టర్ల మధ్య పోటీ నెలకొన్నప్పటికీ, సదరు అధికారులు తమ వారికి ఈ కాంట్రాక్టులను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తూ కాంట్రాక్టర్లను బెదిరించినట్లు విభాగంలోని సిబ్బంది అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. బీచ్ రోడ్డులో ఉన్న సీ హారియర్ ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం నిర్వహణకు 11 నెలలకు గాను రూ.35.05 లక్షల అంచనా వ్యయంతో వీఎంఆర్‌డీఏ అధికారులు ఈ ఏడాది ఏప్రిల్‌లో టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. గత నెల 17వ తేదీతో టెండర్ల సమర్పణకు గడువు ముగిసింది. అయితే ఈ టెండర్‌లో పాల్గొనవద్దని ఒక కాంట్రాక్టర్‌కు ఫోన్ వచ్చిందట.


సీ హారియర్



అయినప్పటికీ ఆ కాంట్రాక్టర్ వేరే సంస్థ పేరుతో టెండర్ వేశారు. మొత్తంగా ఈ పనుల కోసం నలుగురు కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొన్నారు. ఇందులో అత్యల్పంగా 15 శాతం తక్కువకు రూ. 29,48,036కు ఒకరు టెండర్ వేయగా, ఆ తరువాత 9.09 శాతం తక్కువకు రూ.31,86,753కు మరో కాంట్రాక్టు సంస్థ దాఖలు చేసింది. తక్కువకు టెండర్ వేసిన సంస్థకు కాకుండా రెండో స్థానంలో ఉన్న సంస్థకు టెండర్ పనులను అప్పగించేందుకు ఇంజినీరింగ్ అధికారి ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ టెండర్‌ను వదులుకోవాలని తక్కువ బిడ్ చేసిన కాంట్రాక్టర్‌కు చెప్పినట్లు సమాచారం. అందుకు ఆయన అంగీకరించకపోవడంతో అప్పటి నుంచి వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

సింగిల్ టెండర్.. అయినా ఓకే..!

సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ అండ్ కమర్షియల్ బిల్డింగ్ నిర్వహణకు 11 నెలలకు గాను రూ.1,33,48,537కు టెండర్లు ఆహ్వానించింది. ఈ టెండర్‌లో పాల్గొనేందుకు పలువురు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపారు. అయితే, ఈ ఇంజినీరింగ్ అధికారులు తమ పలుకుబడిని ఉపయోగించి, జనసేనకు చెందిన ఒక మహిళా నేతకు ఈ పనులు అప్పగించేందుకు ఒక కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి టెండర్‌లో పాల్గొనవద్దని చెప్పినట్లు సమాచారం. ఆ కాంట్రాక్టర్‌కు ఇప్పటికే వీఎంఆర్‌డీఏలో రూ. కోటి వరకు బిల్లు పెండింగ్‌లో ఉండగా, ఆ బిల్లు కావాలంటే ఈ టెండర్‌కు దూరంగా ఉండాలని బెదిరించినట్లు సిబ్బంది అంతర్గతంగా మాట్లాడుకుంటున్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్ టెండర్ దాఖలు చేయలేదు. ఈ నెల 8వ తేదీతో టెండర్ సమర్పణకు గడువు ముగిసింది. ఆశ్చర్యకరంగా, కేవలం ఒకరు మాత్రమే బిడ్ వేశారు. నిబంధనల ప్రకారం సింగిల్ టెండర్‌ను తిరస్కరించాల్సి ఉండగా, సదరు ఇంజినీరింగ్ అధికారి మాత్రం ఆ సింగిల్ టెండర్‌దారునికే పనులు అప్పగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.



• నీటి ధారల నృత్యం

నగరంలోని ప్రధాన ఆకర్షణలలో ఒకటైన సెంట్రల్ పార్క్‌లో తిరిగి ప్రారంభమైన మ్యూజికల్ ఫౌంటెయిన్ సందర్శకులను విశేషంగా అలరిస్తోంది. రంగురంగుల కాంతులతో నీటి ధారలు సంగీతానికి అనుగుణంగా నృత్యం చేస్తుంటే, పర్యాటకులు, నగరవాసులు ఆ దృశ్యాన్ని ఆస్వాదిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ మ్యూజికల్ ఫౌంటెయిన్ ప్రత్యేక అనుభూతిని పంచుతోంది.

-ఫొటో : సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చదువులు తిరోగమనం

- అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు మంగళం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 82 స్కూళ్లు రద్దు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా 52 స్కూళ్ల మూత
- దూరం కానున్న హైస్కూల్ చదువులు
- గ్రామాల్లో డ్రాపౌట్ కానున్న విద్యార్థులు



గ్రామీణ విద్యకు విఘాతం

కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించనుంది. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారు. గతంలో దూరం ఎక్కువగా ఉండటం వల్ల చాలామంది ఐదో తరగతి తర్వాత చదువు మానేసేవారు. అందుకే గత ప్రభుత్వాలు ప్రాథమికోన్నత పాఠశాలలను అందుబాటులోకి తెచ్చాయి. కానీ, ప్రస్తుత నిర్ణయంతో గ్రామీణ విద్యార్థులకు హైస్కూల్ చదువులు మళ్లీ దూరమయ్యే ప్రమాదం ఉంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్లు పెరిగే అవకాశం ఉందని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. తాజాగా 82 యూపీఎస్‌లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా పాఠశాలల్లోని విద్యార్థులను సమీప హైస్కూళ్లకు తరలించనున్నారు. అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా 52 స్కూళ్లను మూసివేయనుండటంతో, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు హైస్కూల్‌చదువులు దూరం కానున్నాయి. ఈ చర్యల వల్ల గ్రామాల్లో డ్రాపౌట్లు పెరిగే ప్రమాదం ఉందని విద్యావర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విశాఖ జిల్లాలోనూ డ్రాపౌట్లుపెరిగే అవకాశం ఉంది.

విశాఖ విద్య: జిల్లాలో పద్మనాభం మండలం కొత్త కొవ్వాడ ప్రాథమికోన్నత పాఠశాలను రద్దు చేయడంతో ఇక్కడ 6, 7, 8 తరగతులు చదువుతున్న 14 మంది విద్యార్థులు 4 కిలోమీటర్ల దూరంలోని అనంతవరం జెడ్పీహెచ్‌ఎస్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అలాగే భీమునిపట్నం మండలం రెండో వార్డు మున్సిపల్ యూపీఎస్‌ను రద్దు చేసి 17వ వార్డులోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌కు మ్యాప్ చేశారు. ఇక్కడ 6, 7, 8 తరగతుల్లో 40 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ పాఠశాలను రద్దు చేయడం గమనార్హం. జిల్లాలో ఇలా మూడు యూపీఎస్‌లను రద్దు చేశారు. ఈ నిర్ణయాల వల్ల విద్యార్థులు హైస్కూల్ చదువు కోసం ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కూటమి ప్రభుత్వం విద్యారంగంపై ప్రయోగాల పేరుతో పాఠశాలలను మూసివేసేందుకు సిద్ధమవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొమ్మిది రకాల పాఠశాలల పేరుతో పాఠశాల విద్య పునర్నిర్మాణం చేపట్టడం గ్రామీణ ప్రాంత విద్యార్థులను చదువుకు దూరం చేసే చర్యగా ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం సాధారణంగా జరిగే ప్రక్రియ కాగా, ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలను డీగ్రేడ్ చేస్తోందని వారు ఆందోళన వ్యక్తం

మిగతా IIవ పేజీలో ▶

నేడు వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంటరీ స్థాయి సమావేశం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులతో శనివారం సమావేశం జరగనుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తెలిపారు. ఈ మేరకు విశాఖ పార్లమెంట్ పరిధిలోని సమన్వయకర్తలు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులతో పాటు ముఖ్య నాయకులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శనివారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ పరిశీలకులుగా నియమితులైన కె.బాబూరావు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విశాఖ పోర్ట్‌కు గ్రీన్‌టెక్ సీఎస్‌ఆర్ ఇండియా అవార్డు

ఎంవీపీకాలనీ: విశాఖపట్నం పోర్ట్ అథారిటీకి 11వ గ్రీన్‌టెక్ సీఎస్‌ఆర్ ఇండియా–2025 అవార్డు లభించింది. గ్రీన్‌టెక్ ఫౌండేషన్ న్యూఢిల్లీ ఈ మేరకు ప్రకటించింది. కార్పొరేట్ వ్యవహారాల శాఖ యూనియన్ మంత్రి నుంచి సమాచారం అందినట్లు పోర్ట్ అథారిటీ శుక్రవారం తెలిపింది. సీఎస్‌ఆర్ నిధుల వినియోగంలో ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లు, అభివృద్ధి, శిక్షణా కార్యక్రమాల ద్వారా యువత సామర్థ్యాలను పెంపొందించడం, గిరిజన ప్రాంతాలకు అందించిన సేవలకు ఈ అవార్డు లభించినట్లు పోర్టు పేర్కొంది.

పర్యాటక ప్రాజెక్టులపై సీఎస్ సమీక్ష


మాట్లాడుతున్న స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలోని పర్యాటక ప్రాజెక్టుల స్థితిగతులు, ఔత్సాహిక కంపెనీలకు భూ కేటాయింపులు, ప్రభుత్వ సహకారం వంటి అంశాలపై రాష్ట్ర పర్యాటక, గృహనిర్మాణ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ జిల్లా అధికారులతో చర్చించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ కేటాయింపులు చేయాలని ఆదేశించారు. అలాగే పర్యాటక శాఖకు అశోక్ లేల్యాండ్, పోర్టులు అందిస్తున్న డబుల్ డెక్కర్ బస్సుల కోసం చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం, జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాల పురోగతిని సమీక్షించి, నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ జగదీష్, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె. మాధవి, గృహనిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు అధికారి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మూడుముక్కలాట



- జీవీఎంసీలో తారాస్థాయికి కూటమి రాజకీయం
- టీడీపీ, జనసేన అధిష్టానం దృష్టికి పంచాయితీ
- తమకే ఇవ్వాలంటూ పట్టుబడుతున్న జనసేన,బీజేపీ
- ససేమిరా అంటున్న టీడీపీ
- ఇరు పార్టీల మధ్య అగ్గిరాజేస్తున్న డిప్యూటీ మేయర్ పదవి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో కూటమి రాజకీయం తారాస్థాయికి చేరింది. అవిశ్వాసం ద్వారా గత మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లను పదవుల నుంచి తొలగించడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఆ తర్వాత మేయర్‌ను తొలగించి, తెలుగుదేశం పార్టీకి చెందిన పీలా శ్రీనివాస్‌ను కూటమి సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాజాగా డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయానికి వస్తే, కూటమిలో విభేదాలు మొదలయ్యాయి. మేయర్ పదవిని తీసుకున్నందున, డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నారు. ఈ వివాదం తెలుగుదేశం పార్టీ అధిష్టానం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ల దృష్టికి చేరింది.

తమకంటే తమకు కావాలంటూ..

మేయర్ పదవిని తెలుగుదేశం పార్టీ తీసుకున్నందున, పొత్తులో భాగంగా డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించాలని ఆ పార్టీ కార్పొరేటర్లు, పెద్దలు పట్టుబడుతున్నారు. తెలుగుదేశం పార్టీకి డిప్యూటీ మేయర్ పదవి ఇస్తే తాను రాజీనామా చేస్తానని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పార్టీ అధినేతకు బహిరంగంగా లేఖ పంపారు. దీంతో కూటమి రాజకీయం వేడెక్కింది. పొత్తు ధర్మంలో భాగంగా డిప్యూటీ మేయర్ పదవి తమకు కావాలని జనసేన పార్టీ ఎప్పటి నుంచో ఆశిస్తోంది. ఇదిలా ఉండగా, జనసేన పార్టీ నుంచి డిప్యూటీ మేయర్ పదవి కోసం ఇటీవలే వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలో చేరిన పెద్దిరెడ్డి ఉష, వంశీరెడ్డి, మాసిపోగు మేరీజోన్స్, ఇండిపెండెంట్‌గా గెలిచి ఆ పార్టీలో చేరిన మహ్మద్ సాదిక్, కందుల నాగరాజుతో పాటు ఆ పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి కూడా పోటీలో ఉన్నారు.

తాడోపేడో..

డిప్యూటీ మేయర్ ఒక్క పోస్టు కోసం రెండు పార్టీలు పట్టువిడవకుండా ఉన్నాయి. ఈ విషయంలో తేల్చుకోవడానికి సిద్ధపడుతున్నాయి. డిప్యూటీ మేయర్ తమకే ఇవ్వాలని జనసేన గట్టిగా పట్టుబడుతుండగా, తెలుగుదేశం పార్టీ మాత్రం ఈ పదవిని వదులుకోవడానికి సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఈ పదవి కోసం ఈ నెల 19న ఎన్నిక జరగనుంది. మేయర్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకోవడంతో, డిప్యూటీ మేయర్ తమకు కేటాయించాలని జనసేన కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రాజీనామా చేస్తామని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ శుక్రవారం పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు లేఖ పంపడంపై కూటమిలో విభేదాలు తారాస్థాయికి చేరాయి.

నువ్వా..నేనా?

డిప్యూటీ మేయర్ పదవిపై పార్టీల అధినాయకులు తేల్చకపోవడంతో ఇరు పార్టీల్లోనూ ఆశావాహుల సంఖ్య పెరిగింది. టీడీపీలో 10 మంది వరకు ఈ పదవి కోసం పోటీ పడతుండగా, జనసేనలో ఉన్న వారంతా (ఒక్క మూర్తి యాదవ్ తప్ప..ఎందుకంటే మూర్తి యాదవే తనను మినహాయించి ఎవరికైనా ఇవ్వాలని పవన్ కల్యాణ్‌కు పంపిన లేఖలో పేర్కొన్నారు) రేసులో ఉన్నట్టు తెలిసింది. ఎవరి స్థాయిలో వారు సీనియర్ల ద్వారా అధినాయకుడి ఆశీస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా ఇరు పార్టీల నుంచి ఇద్దరు పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. టీడీపీ నుంచి 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుకు డిప్యూటీ మేయర్ కట్టబెట్టాలని ఆ పార్టీలో పలువురు కార్పొరేటర్లు భావిస్తూ..ఆ పేరు ప్రతిపాదించినట్టు సమాచారం. ఇక జనసేన విషయానికొస్తే..ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మేయర్‌గా టీడీపీ నేత ఉండడంతో డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ఈ పదవిని జనసేన వదులుకునే ప్రసక్తే లేదంటూ తెగేసి చెబుతున్నారు. జనసేన నుంచి ఎందరో ఆశావాహులున్నా..ఎమ్మెల్యేలు మాత్రం ఉషశ్రీ పేరు పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఏది ఏమైనా కూటమిలో డిప్యూటీ మేయర్ పదవి పెద్ద రాద్ధాంతం చేస్తోంది.

అంత సీన్ లేదు..

తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్‌కే డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలంటూ సాక్షాత్తు నూతనంగా ఎన్నికైన మేయరే అధిష్టానానికి లేఖ పంపినట్టు భోగట్టా. వీరిద్దరి మధ్య నేను అర్హురాలినేనంటూ బీజేపీ కార్పొరేటర్ కూడా రేస్‌లో ఉన్నట్టు సమాచారం. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే కూటమిలో అంతర్గత తగాదాలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పడానికి ఈ కుమ్ములాటలే నిదర్శనం.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మహారాణిపేట: మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తూర్పు ప్రాంత నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు సంధ్యారావు పెంధార్కర్ అన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో వేవ్స్–2025 పేరుతో గైనకాలజీపై ప్రెసిడెన్షియల్ నేషనల్ కాన్ఫరెన్స్ జరగనుంది. ఇందులో భాగంగా ఆంధ్రా మెడికల్ కళాశాలలో శుక్రవారం ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'నో యువర్ నంబర్స్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారావు మాట్లాడుతూ మహిళల కోసం క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, నైపుణ్య శిక్షణ, ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేయడం తదితర కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తదితరులు మహిళల ఆరోగ్యం, ప్రాముఖ్యతను వివరించారు. తూర్పు నావల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ సతీమణి అయిన సంధ్యారావును ఈ సందర్భంగా సన్మానించారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎంఎన్వీ పల్లవి, ఫోగ్సీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ పళనియప్పన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్. శశిప్రభ, మెరైన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఫైనాన్స్ డైరెక్టర్ సీమా ఆనంద్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ వాణి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రసూతి, గైనకాలజీ విభాగానికి చెందిన వైద్య విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, అధ్యాపకులు, నగరంలోని గైనకాలజిస్టులు హాజరయ్యారు. దాదాపు 200–250 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి.. వారి ఆరోగ్య డేటాను సేకరించారు.

అయ్యవార్లకు తిప్పలు

- మెడికల్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం
- 'అపస్' ఫిర్యాదుతో తేరుకున్న కేజీహెచ్ వైద్యులు
- హడావుడిగా డీఈవో కార్యాలయానికి అందజేత
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,200 మంది పీహెచ్ టీచర్లు
- వీరిలో 442 మంది వైకల్యంపై నిశిత పరిశీలన



కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న అపస్ సంఘం నాయకులు

విశాఖ విద్య: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు తీవ్ర కసరత్తు జరుగుతోంది. ప్రభుత్వం జారీ చేసిన బదిలీల చట్టం మేరకు ఖాళీల గుర్తింపు ఒక కొలిక్కి వచ్చింది. పాఠశాలల పునర్నిర్మాణంపై ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకత వ్యక్తం చేస్తూ ఆందోళనలకు పిలుపునిచ్చినా.. బదిలీలు చేపట్టేలా విద్యాశాఖాధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాధాన్యతల పాయింట్లు కేటాయింపునకు సంబంధిత ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని డీఈవో కార్యాలయ అధికారులు ప్రత్యేక గూగుల్ ఫాంను విడుదల చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, దివ్యాంగ ఉపాధ్యాయులు వెంటనే ఈ ఫాం పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే జిల్లా స్థాయి ప్రత్యేక శిబిరానికి హాజరైనా.. నేటికి కూడా మెడికల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా గూగుల్ ఫాం పూర్తి చేయాలని ఆదేశించడంతో అయ్యవార్లకు తిప్పలు తప్పడం లేదు.

వైకల్యం నిజమేనా?

బదిలీల సందర్భంగా ప్రాధాన్యత కోరుతున్న ఉపాధ్యాయులు గతంలో సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్లు చెల్లవని ప్రభుత్వం స్పష్టం చేసింది. వాటి కోసం మళ్లీ వైద్యుల ముందు హాజరుకావాల్సిందేనని ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలో 1,200 మంది వరకు ప్రాధాన్యత పాయింట్లు పొందే ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 56 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు గతంలో సమర్పించిన సర్టిఫికెట్లలో వాస్తవమెంత అనేది తేల్చాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లా మెడికల్ బోర్డు ముందు 442 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. సర్టిఫికెట్ల జారీ కోసం కొంతమంది ఉపాధ్యాయులు వైద్యులను మేనేజ్ చేశారని ప్రచారం సాగుతోంది.

20 రోజులు గడిచినా అందని సర్టిఫికెట్లు

జిల్లా స్థాయి మెడికల్ బోర్డు ముందు హాజరై 20 రోజులు గడుస్తున్నా.. వైకల్య ధ్రువీకరణ పత్రాలు(మెడికల్ సర్టిఫికెట్లు) అందకపోవడంపై కొంతమంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై అపస్ సంఘం జిల్లా నాయకులు శుక్రవారం కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో తేరుకున్న కేజీహెచ్ పాలనాధికారులు ఆయా విభాగాల్లో ఉన్న సర్టిఫికెట్లు సేకరించి, హుటాహుటిన డీఈవో కార్యాలయానికి పంపించారు.

ఎంఈవోలకు పంపించాం



కేజీహెచ్ నుంచి శుక్రవారం మెడికల్ సర్టిఫికెట్లు అందాయి. వాటిని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా డీఈవోలకు వెంటనే పంపించాం. విశాఖ జిల్లాకు సంబంధించి ఎంఈవోల ద్వారా సంబంధిత ఉపాధ్యాయులకు అందించాలని ఆదేశించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశాం.

– ఎస్.ప్రేమ్ కుమార్, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

దివ్యాంగులకు న్యాయం చేయాలి



దివ్యాంగుల చట్టాన్ని ప్రభుత్వం విస్మరించింది. దీనిపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు తీర్పుకు అనుగుణంగా బదిలీల్లో ప్రాధాన్యం కల్పించి దివ్యాంగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.

–ఎ.శ్రీనివాసరావు, వికలాంగుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, విశాఖపట్నం

చదువులు తిరోగమనం

▶ I వ పేజీ తరువాయి

చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేయడం ద్వారా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యారంగ నిపుణులు అంటున్నారు. విద్యాశాఖ చరిత్రలో ఇలాంటి నిర్ణయాలు ఎప్పుడూ చూడలేదని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 82 స్కూళ్ల రద్దు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 82 ప్రాథమికోన్నత పాఠశాలలను (యూపీఎస్) రద్దు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లాలో 3, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 27, అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా 52 పాఠశాలలు రద్దు కానున్నాయి. ఇకపై ఈ పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రద్దు చేసిన యూపీఎస్‌లలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలకు తరలించాలని ఆదేశిస్తూ, దీనికి సంబంధించిన మ్యాపింగ్‌ను కూడా పూర్తి చేశారు. ఈ విధానం 2025–26 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానుందని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుల్లో అసంతృప్తి

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3, 4, 5 తరగతులను సమీప హైస్కూళ్లలో విలీనం చేసి, ప్రైమరీ తరగతులకు స్కూల్ అసిస్టెంట్లతో బోధన ఏర్పాటు చేసింది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు చేయడంతో 6, 7, 8 తరగతులను సమీప హైస్కూళ్లకు తరలిస్తున్నారు. ఫలితంగా, ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు (స్కూల్ అసిస్టెంట్లు) వేరే చోటుకు బదిలీ కావలసి వస్తోంది. పాఠశాలల పునర్నిర్మాణం వల్ల ఉపాధ్యాయ పోస్టులకు కోత పడుతోంది. యూపీఎస్‌లు రద్దు చేయడంతో స్కూల్ అసిస్టెంట్లు వేర్వేరు హైస్కూళ్లకు బదిలీ కానున్నారు. ఈ పరిణామాలతో ఉపాధ్యాయులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు కక్ష రాజకీయాలు చేస్తున్నారు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ

దాబాగార్డెన్స్: మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, మాజీ ప్రభుత్వాధికారి కృష్ణమోహన్ రెడ్డి అరెస్టులను ఖండిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష రాజకీయాలు చేస్తున్నారని శుక్రవారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. లేని మద్యం కుంభకోణం ఉన్నట్టు చూపిస్తూ సిట్ పేరిట అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఆయన హయాంలో విశాఖ భూ కుంభకోణంపై వేసిన సిట్ ఎంత మందిని అరెస్టు చేసింది? ఆ విచారణ వివరాలు, సిట్ రిపోర్ట్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అది మానేసి కేవలం కక్ష రాజకీయాలకు పాల్పడతున్నారని మండిపడ్డారు. దీని వల్ల వ్యవస్థలు దెబ్బతింటున్నాయని, తప్పుడు కేసులు పెట్టి, తప్పుడు సాక్ష్యాలు, వాంగ్మూలాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాధికారులు, మాజీ ప్రభుత్వాధికారులపై కూడా రాజకీయ కక్ష చూపిస్తున్నారని, ఇది చాలా అన్యాయమని కొండా రాజీవ్ అన్నారు. చంద్రబాబు హయాంలో మద్యంపై రూ.70 వేల కోట్లు ఆదాయం వస్తే జగన్ హయాంలో రూ.1.06 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి డబ్బులు పక్కదారి పట్టిస్తే అది కుంభకోణం అవుతుంది. కానీ ప్రభుత్వానికి ఆదాయం పెంచితే కుంభకోణం ఎలా అవుతుందని ప్రశ్నించారు. లిక్కర్ వ్యవహారంలో ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు చూపలేదని.. కానీ బెదిరించి, భయపెట్టి తప్పుడు వాంగ్మూలాలు తీసుకుని, అక్రమ అరెస్టులు చేస్తున్నారని కొండా రాజీవ్‌గాంధీ ఆరోపించారు.

నేడు మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు రాక

మహారాణిపేట: రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ శనివారం విశాఖ వస్తున్నారు. ఉదయం 4.20 గంటలకు ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ వస్తారు. అక్కడ నుంచి ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని బస చేస్తారు. ఉదయం 9 గంటలకు కూర్మన్నపాలెం వుడా కాలనీ, ఫకీర్‌తక్యా తదితర ప్రాంతాలను సందర్శిస్తారు. 11 గంటలకు కలెక్టరేట్ చేరుకుని సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. 12 గంటలకు చోడవరం బయలుదేరుతారు. రాత్రికి తిరిగి విశాఖ చేరుకుని బస చేస్తారు. 18న స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళతారు.

'పర్యాటక శాఖకు భూమి కేటాయింపుపై అభ్యంతరం'

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ సర్వే నంబర్ 101/1లో పర్యాటక శాఖకు రాష్ట్ర ప్రభుత్వం 18.70 ఎకరాల భూమి కేటాయించడంపై భోగాపురం మండలం తూడెం పంచాయతీకి చెందిన రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్‌కు వినతి పత్రం అందించారు. 'విజయనగరం జిల్లా ఏర్పాటుకు ముందు.. ఉమ్మడి విశాఖ జిల్లాలోని భీమిలి మండలం అన్నవరం సర్వే నంబర్ 101/1లో గల 199.28 ఎకరాల ప్రభుత్వ భూమిలో తోట పంటలు సాగు చేసుకుంటున్నాం. రెవెన్యూ అధికారులు గుర్తించి మా పేరిట ఎంజాయ్‌మెంట్ నమోదు చేశారు. 1971 నుంచి 2000 వరకు భీమిలి తహసీల్దార్లు డీ పట్టాలు కూడా మంజూరు చేశారు. మా పేరిట భూమి శిస్తు రసీదులు ఉండగా.. 10–1 అడంగల్‌లో ఎంజాయ్‌మెంట్ వివరాలు కూడా నమోదై ఉన్నాయి. ఈ క్రమంలో జీవో నంబర్ 72 ప్రకారం ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌కు భూమినివ్వాలని కోరగా.. హైకోర్టును ఆశ్రయించాం. పై సర్వే నంబర్లలో జరిగిన చట్ట వ్యతిరేక రిజిస్ట్రేషన్లు చెల్లవని, వాటిని రద్దు చేయాల్సిందిగా గతంలోనూ కోరాం. కోర్టు పరిధిలో ఉన్న ఈ విషయాలను రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి తెలియజేయకపోవడం వల్లే పర్యాటక శాఖకు ఈ భూములను కేటాయించింది.' అని తూడెం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై న్యాయం చేయాలని కోరుతూ ఆర్డీవోను ఆశ్రయించినట్లు రైతులు తెలిపారు.

ఎస్కార్ట్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఆరిలోవ: ఎస్కార్ట్ విధులు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. విశాలాక్షినగర్‌లో కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది నుంచి వ్యక్తిగత, విధి నిర్వహణకు సంబంధించిన సమస్యలు, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నిందితులను జైలు నుంచి కోర్టుకు తీసుకువెళ్లి తిరిగి జైలుకు తరలించే సమయంలో ఎస్కార్ట్ పోలీసులు అత్యుత్తమ భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. తీవ్ర నేరాలకు పాల్పడిన నిందితుల విషయంలో వారి నేర చరిత్రను దృష్టిలో పెట్టుకుని మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఇటీవల కోర్టు, కేజీహెచ్ వద్ద నిందితులు ఎస్కార్ట్ పోలీసుల నుంచి తప్పించుకున్న సంఘటనలను ఆయన గుర్తు చేశారు. అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా క్రమశిక్షణతో పటిష్టంగా ఎస్కార్ట్ విధులు నిర్వహించాలన్నారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అదనపు డీఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఏవో రాంకుమార్, పరేడ్ కమాండర్ మన్మథరావు, బాల సూర్యారావు తదితరులుపాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై ప్రత్యేక శిక్షణ

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎం–విశాఖపట్నంలో మూడు రోజుల బిజినెస్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 81 మంది నిష్ణాతులైన కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు ఉండగా, ఈ ప్రారంభ బ్యాచ్‌లో 60 మంది పాల్గొన్నారు. ఇందులో పాల్గొనే వారికి పీర్ లెర్నింగ్, ఫ్యాకల్టీ ఇంటరాక్షన్, సహకార అభ్యాసం అందించనున్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొఫెసర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ అభ్యాస అనుభవాన్ని మెరుగుపరిచేందుకు, సభ్యులను చైతన్యం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో మూడు ఉత్తమ క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులను ఎంపిక చేస్తామన్నారు. నాయకత్వం, వ్యూహాత్మక నిర్వహణ, ఎంటర్‌ప్రైజ్ రిస్క్, బిజినెస్ అనలిటిక్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కీలకమైన అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. కో–డైరెక్టర్ ప్రొఫెసర్ అమిత్ శంకర్ మాట్లాడుతూ సమతుల్యత, మానవ కేంద్రీకృత విధానాల గురించి వివరించారు. నేటి వ్యాపార వాతావరణంలో సమర్థవంతమైన నిర్వహణ, నాయకత్వం స్వీకరించడానికి అవసరమైన మానవ నైపుణ్యాలు అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐఐఎంవీ.. మారుతున్న వ్యాపార రంగంలో మార్గనిర్దేశం చేయడానికి ఎప్పటికప్పుడు నిపుణులను సిద్ధం చేస్తుందన్నారు.

వాల్తేర్ డిపో కండక్టర్, డ్రైవర్ నిజాయితీ

ఎంవీపీకాలనీ: బంగారు ఆభరణాలతో కూడిన బ్యాగును బస్సులో మర్చిపోయిన ఓ ప్రయాణికురాలికి ఆర్టీసీ సిబ్బంది తిరిగి అప్పగించారు. గురువారం రాత్రి 999 నంబర్ గల బస్సులో ప్రయాణించిన ఓ మహిళ ఐదు తులాల బంగారంతో పాటు దుస్తులున్న బ్యాగును బస్సులోనే మరిచిపోయి దిగిపోయింది. కొద్దిసేపటి తర్వాత బ్యాగును గమనించిన ఆ బస్సు కండక్టర్ జి.గిరిబాబు, డ్రైవర్ డి.ఎ.బాబు దానిని వాల్తేరు డిపో సూపరింటెండెంట్‌కు సెక్యూరిటీ సమక్షంలో అప్పగించారు. తమ బ్యాగు పోగొట్టుకున్నట్లు గుర్తించిన ప్రయాణికురాలి కుటుంబ సభ్యులు శుక్రవారం డిపోను సంప్రదించగా.. అధికారులు ఆ బ్యాగును వారికి అందజేశారు. దీంతో ఆనందం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు.. కండక్టర్, డ్రైవర్ల వివరాలు తెలుసుకుని వారు విధుల్లో ఉన్న బస్సు వద్దకు వెళ్లారు. అక్కడ వారికి ఘనంగా సన్మానించారు. అనంతరం సిబ్బంది చేతులమీదుగా తమ ఆభరణాలను తిరిగి తీసుకుని సంతోషించారు. ఆర్టీసీ ప్రతిష్టను పెంచిన కండక్టర్, డ్రైవర్‌ను డిపో యాజమాన్యంతో పాటు ఉద్యోగులు అభినందించారు.



కండక్టర్, డ్రైవర్ చేతుల మీదుగా ఆభరణాలను తీసుకుంటున్న ప్రయాణికురాలి బంధువులు

ఏపీఎస్పీ బెటాలియన్‌లో సేవా పతకాల ప్రదానం

పీఎంపాలెం: బక్కన్నపాలెం సమీపంలోని ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి 16వ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ సేవా పతకాలు అందజేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఐదు ఉత్కృష్ట, రెండు అతి ఉత్కృష్ట, నాలుగు 75 సంవత్సరాల సేవా పతకాలను అందించారు. అలాగే 8వ ఎన్‌డీఆర్‌ఎఫ్ స్థాయి సీఎస్ఎస్ఆర్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచి రూ.50 వేలు నగదు బహుమతి సాధించిన బెటాలియన్ ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందికి శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రవాదుల ప్రాబల్యం ఉండే ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇన్‌చార్జ్ అడిషనల్ కమాండెంట్ వి.సత్యం, అసిస్టెంట్ కమాండెట్లు వి. నారాయణరావు, జి.ఇలయా సాగర్, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందిని అభినందిస్తున్న బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ

మధురవాడలో 87.8 ఎకరాల అభివృద్ధికి ప్రణాళికలు

23న హైదరాబాద్, 30న బెంగళూరులో రోడ్ షో

విశాఖ సిటీ: మధురవాడలోని 87.80 ఎకరాల వీఎంఆర్డీఏ భూమిని పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు చైర్మన్ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో క్రెడాయ్, నేరెడ్కో, అప్రైడా ప్రతినిధులతో శుక్రవారం సమావేశమై ఈ ప్రాజెక్టుకు గల అవకాశాలను వివరించారు. ఈ భూమికి బీచ్ కారిడార్, డబుల్ డెక్కర్ మోడల్‌లో మెట్రో రైలు ప్రాజెక్టు, ఐటీ సిటీ, కన్వెన్షన్ సెంటర్లతో పాటు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరువలో ఉండడం అదనపు ఆకర్షణ అని వివరించారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో, 30న బెంగళూరులో ఈ భూమికి సంబంధించి రోడ్ షో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జాయింట్ కమిషనర్ రమేష్, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీ శంకర్, బలరామరాజు, ప్రణాళికాధికారులు వెంకటేశ్వరరావు, అరుణవల్లి, చామంతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగికి అంతర్జాతీయ టైటిల్

ఉక్కునగరం: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బి.వి.ఎస్.కె.లింగేశ్వరరావు జంట విజేతగా నిలిచింది. ఈ నెల 10 నుంచి 14 వరకు తైపీలో తైవాన్ ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 12 దేశాలకు చెందిన 2,500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 55+ కేటగిరీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సుజానే వెంగిలెట్‌తో లింగేశ్వరరావు పాల్గొన్నారు. సెమీఫైనల్స్‌లో మలేషియాతో పోటీపడి గెలిచిన లింగేశ్వరరావు జంట.. ఫైనల్స్‌లో జపాన్‌ను ఓడించి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన్ని స్టీల్‌ప్లాంట్ అధికారులు, పలువురు క్రీడాకారులు అభినందించారు.



విజేతగా నిలిచిన లింగేశ్వరరావు జంట

నేడు ఐఐపీఈ స్నాతకోత్సవం

51 మందికి డాక్టరేట్‌లు

విశాఖ విద్య: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) 5వ స్నాతకోత్సవం శనివారం నోవాటెల్‌లో జరగనుందని ఐఐపీఈ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పి.కె.బానిక్, డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ తెలిపారు. ఐఐపీఈలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. స్నాతకోత్సవానికి హిందుస్థాన్ జింక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, హోల్ టైమ్ డైరెక్టర్ అరుణ్ మిశ్రా ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 51 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. అకడమిక్ ఎక్స్‌లెన్స్‌కు గుర్తింపుగా ఒక్కో అకడమిక్ ప్రోగ్రామ్ నుంచి ఇద్దరు విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ ప్రదానం చేస్తామన్నారు. అకడమిక్ సీజీపీఏ, ఎక్స్‌ట్రా కరిక్యులర్ విజయాల ఆధారంగా ఓవరాల్ ఎక్స్‌లెన్స్ కోసం ఒక ఉత్తమ విద్యార్థికి ప్రతిష్టాత్మక రాష్ట్రపతి బంగారు పతకం లభిస్తుందన్నారు. ఇంధన రంగంలో లింగ వైవిధ్యం, సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించే దిశగా యూజీ, పీజీ రెండింటిలోనూ ఉత్తమ అవుట్ గోయింగ్ గర్ల్ స్టూడెంట్ కోసం కొత్త గోల్డ్ మెడల్‌ను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ కె.విజయకుమార్, ప్రొఫెసర్ హిమాంశు, రామ్ ఫాల్ ద్వివేది పాల్గొన్నారు.

21 నుంచి జూలో సమ్మర్ క్యాంప్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఐదు రోజుల పాటు పిల్లల కోసం సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. జూ పార్కు, జీవీఎంసీ, వైల్డ్ లైఫ్ కన్సర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ యూత్ కన్జర్వేషన్ యాక్షన్ నెట్‌వర్క్ సంయుక్తంగా ఈ నెల 21 నుంచి 25 వరకు ఈ క్యాంప్‌ను నిర్వహించనున్నాయన్నారు. పిల్లలకు జంతు ప్రపంచం, వాటి పరిరక్షణపై అవగాహన కల్పిస్తారు. జూ వెటర్నరీ ఆస్పత్రి సందర్శన, జంతు సంరక్షకులతో పరిచయం, పక్షుల వీక్షణ వంటి కార్యక్రమాలు ఉంటాయి. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంప్ జరుగుతుంది. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1000. పాల్గొన్న వారికి సర్టిఫికెట్, టీషర్ట్, జూ పుస్తకం, బ్రోచర్లు ఇస్తారు. వివరాల కోసం 7893632900ను సంప్రదించాలన్నారు.

ఇద్దరు యువకులను రక్షించిన బీచ్‌గార్డ్స్

బీచ్‌రోడ్డు: ప్రమాదకరమైన అలల్లో చిక్కుకుపోయిన ఇద్దరు యువకులను బీచ్‌గార్డ్స్ అతికష్టం మీద రక్షించారు. వివరాలివి. తాడేపల్లిగూడెంకు చెందిన యువకులైన సాయి, కృష్ణ శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఆర్కేబీచ్‌ను సందర్శించారు. ఆ తర్వాత స్నానం కోసం సముద్రంలోకి వెళ్లిన వారిని ఓ పెద్ద కెరటం ఒక్కసారిగా లోపలకు లాగేసింది. ఈ విషయాన్ని గమనించిన పర్యాటకులు వెంటనే మెరైన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు బీచ్‌గార్డ్స్ రాకేష్, సాగర్‌ను ఘటన స్థలానికి పంపారు. బీచ్‌గార్డ్స్ అతికష్టం మీద సంద్రంలో చిక్కుకుపోయిన వారిద్దరినీ రక్షించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని బంధువులకు అప్పగించారు.



యువకులతో మెరైన్ పోలీసులు, బీచ్‌గార్డ్స్

ఫిర్యాదులు రాకుండా పనిచేయండి

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల భద్రత, సౌకర్యాలు, సరకు రవాణా, ట్రాక్ నిర్వహణకు అధిక ప్రాధాన్యమివ్వాలని ట్రైన్ మేనేజర్లు, సిబ్బందిని ఈస్ట్‌కోస్ట్ రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ మోహెస్ కుమార్ బెహరా ఆదేశించారు. ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తూ, రైల్వేపై ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పనిచేయాలని సూచించారు. విశాఖ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్ 3వ వాల్తేర్ డివిజనల్ బైఎన్నియల్ జనరల్ బాడీ మీటింగ్‌లో ఆయన గార్డులు, ఇతర సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో డీఆర్‌ఎం లలిత్‌కుమార్ బోరాతో కలిసి వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు.